నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

మహేశ్వరం: మండలంలోని నందుపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి, విఘ్నేశ్వర, పార్వతి, శివలింగ, నంది, నవగ్రహ నూతన విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఈ నెల15 నుంచి 17వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయ ప్రారంభం, విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలకు ప్రజలు, భక్తులు హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

పూజ కార్యక్రమాలు

15వ తేదీ ఉదయం 9 గంటలకు గణపతి పూజ, పుణ్యాహ వాచనం, అఖండ దీపస్థాపన, దీక్షా స్వీకారం, నవగ్రహ, యోగిని, వాస్తు, క్షేత్రపాలక బ్రహ్మ మండల పూజలు, అగ్నిప్రతిష్ఠ, స్థాపిత దేవతా హోమాలు, జలాధివాసం, ప్రసాద వితరణ, 16న గణపతి పూజ, పుణ్యాహవాచనం, విగ్రహ స్నపనం, స్థాపిత దేవాతా హోమాలు, ధాన్య, ఫల, పుష్ప ప్రసాద వితరణ, 17వ తేదీ ఉదయం 5.15 నిమిషాలకు గర్తన్యాసం, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, ఆశీర్వచనం నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు దర్శనంతో పాటు పలు పూజ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ వేడుకలకు మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి హాజరు కానున్నట్లు నందుపల్లి సర్పంచ్ దేశపాగ కళావతి, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. 17వ తేదీ రాత్రి 8 గంటల నుంచి ప్రముఖ కళాకారుడు జంగిరెడ్డి బృందం చేత తెలంగాణ ధూంధాం, ఆధ్యాత్మిక గీతాలాపన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఆంజనేయస్వామి ఆలయం

కుండల తయారీలో కుమ్మరులకు శిక్షణ

బడంగ్‌పేట్: వేసవి కాలం సమీపిస్తుండగా.. పేదోడి ఫ్రిజ్‌ల(కుండలు)ను కుమ్మరి సారెపై తయారు చేసేందుకు గాను కుమ్మరులకు శిక్షణ ఇచ్చేందుకు గ్రామీణ పరిశ్రమల కమిషన్ శ్రీకారం చుట్టింది. మంగళవారం కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్ బాలాజీనగర్‌లో కుమ్మరులకు శిక్షణ, పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 'ఖాదీబార్ స్వశక్తికరణ్' పేరుతో రంగారెడ్డి జిల్లా ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కుమ్మరులు పాత విధానంతో పాటు కొత్తగా వస్తున్న మట్టి సీసాలు, చల్లని నీరు నిల్వ ఉంచే కుండలు, కుమ్మరి చక్రం సాయంతో చేసిన వంట పాత్రలు, విద్యుత్ అవసరం లేకుండా చల్లగా ఉండే మట్టి కుండలను నేటి తరాలకు తగినట్లుగా ఎలా తయారు చేయాలో శిక్షణ ఇవ్వనున్నారు. ప్రస్తుత రోజుల్లో ప్రజలు ఫ్రిజ్‌లకు బదులు మట్టితో తయారుచేసిన వస్తువులపైనే మొగ్గు చూపుతున్నారని నిర్వాహకులు చెప్పారు. నేటి నుంచి ఈ నెల 22 వరకు కుమ్మరులకు మట్టితో కొత్తగా తయారు చేసే వస్తువులపై అవగాహనతో పాటు శిక్షణ పొందిన వారికి కుమ్మరి చక్రంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. అనంతరం చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అన్నగారి శ్రీరాములు, మంగళపల్లి మధుసూదన్, రాజ్‌కుమార్ తదితరులున్నారు.



కుండల తయారీలో శిక్షణ ఇస్తున్న గ్రామీణ పరిశ్రమల నిర్వాహకులు

పుల్వామా దాడి దేశ చరిత్రలో దుర్దినం

మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

మీర్‌పేట: పుల్వామాలో ఉగ్రదాడి జరిగిన రోజు దేశ చరిత్రలో దుర్దినంగా నిలిచిపోతుందని మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి అన్నారు. 2019 ఫిబ్రవరి 14న పుల్వామాలో ఉగ్రవాదుల ఆత్మాహుతి దాడిలో అమరులైన 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లకు మంగళవారం మీర్‌పేట టీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులతో కలిసి కృష్ణారెడ్డి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుల్వామా ఘటనతో దేశం మొత్తం ఉలిక్కి పడిందని, దేశ రక్షణలో భాగంగా విధులకు హాజరవుతున్న జవాన్లపై ఉగ్రదాడి జరగడం బాధాకరమని తెలిపారు. పుల్వామా దాడి ఘటన దేశానికి చీకటి రోజన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ హరినాథ్‌రెడ్డి, కోశాధికారి అమర్‌నాథ్‌రెడ్డి, ఏఈ నర్సింహారెడ్డి, ఎన్‌సీసీ ఇన్‌చార్జ్ నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



అమర జవాన్లకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, విద్యార్థులు

ప్రజా సమస్యలు పట్టని బీఆర్‌ఎస్

- ఇచ్చిన హామీలు మరచిన సీఎం కేసీఆర్
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

కందుకూరు: ప్రభుత్వాన్ని నడపడంలో, ప్రజా సమస్యలు పరిష్కరించడంలో బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఆరోపించారు. మండల పరిధిలోని బేగంపేటలో భాజపా మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన 'ప్రజాగోస' కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీలను మరచి, మాటల గారడితో కాలం గడుపుతున్నారని విమర్శించారు. దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానని అధికారంలోకి వచ్చిన కేసీఆర్.. దళితబంధుతో దళితులను మభ్యపెట్టి ఓట్లు దండుకున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం పేదలకు పది వేల కోట్ల గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందజేసిందని, ప్రధాని నరేంద్రమోదీ ప్రపంచ దేశాల ఆదరణ చూరగొన్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గం కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, ఎంపీపీ మంద జ్యోతి, శక్తి కేంద్రం ఇన్‌చార్జి తలసాని జగదీశ్వర్‌రెడ్డి, సహ ఇన్‌చార్జి అమరేందర్, దళిత మోర్చా రాష్ట్ర నాయకుడు మంద పాండు, ఎంపీటీసీ బాలరాజు, పీఏసీఎస్ డైరెక్టర్ గౌర పర్వతాలు, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్లబోలు నర్సింహారెడ్డి, మండల ప్రధానకార్యదర్శి నిమ్మ అంజిరెడ్డి, యువమోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి బూర దిలీప్‌గౌడ్, మండల ఉపాధ్యక్షుడు సురసాని భూమిరెడ్డి, కిసాన్ మోర్చా మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు హరిబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

చేతిరాత పరీక్షలో విద్యార్థినుల ప్రతిభ

మీర్‌పేట: హయత్ స్మార్ట్ లర్నింగ్ సంస్థ దేశ వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో నిర్వహించిన హ్యాండ్ రైటింగ్ ఒలింపియాడ్ పరీక్షలో మీర్‌పేట లార్డ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆర్‌ఎన్‌రెడ్డి నగర్ శాఖ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మంగళవారం విద్యాసంస్థ చైర్మన్ సిద్దాల బీరప్ప పాఠశాల ఆవరణలో విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ పరీక్షలో తమ విద్యాసంస్థల్లోని 170 మంది విద్యార్థులు పాల్గొనగా, ఆర్‌ఎన్‌రెడ్డి నగర్ శాఖకు చెందిన ముగ్గురు విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత పురస్కారం లభించినట్లు ఆయన తెలిపారు. హ్యాండ్ రైటింగ్ స్కిల్ పరీక్షలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం ఆయన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికేట్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిషన్‌రావు, ఇన్‌చార్జ్ చంద్రకళ, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో బీరప్ప

బడంగ్‌పేట్‌లో..

కార్పొరేషన్ పరిధిలోని లార్డ్స్ ఒలంపియాడ్ స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు హాండ్ రైటింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పతకాలు అందజేశారు. లార్డ్స్ స్కూల్ విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ బైర్లు శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ అనురాధ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా స్థలానికి యాదయ్య పేరు పెట్టాలి

బడంగ్‌పేట్: గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ క్రీడా ప్రాంగణానికి తెలంగాణ కోసం బలదానం చేసుకున్న సిరిపురం యాదయ్య పేరును పెట్టాలని బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు కోరారు. మంగళవారం ఈ మేరకు మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డికు వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి మాట్లాడుతూ.. మంత్రి సబితారెడ్డి ఆదేశాలకు అనుగుణంగా బడంగ్‌పేట ప్రథమ పౌరులకు విన్నవించినట్లు తెలిపారు. అమరుడు సిరిపురం యాదయ్య తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. అతని త్యాగాన్ని, ధైర్యాన్ని గుర్తించుకునేలా ప్రభుత్వ క్రీడా ప్రాంగణానికి యాదయ్య పేరు పెట్టాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, లిక్కి మమత, ఏనుగు రాంరెడ్డి, రామిడి కవిత, సూర్ణగంటి అర్జున్, పెద్దబావి శోభ, భీమిడి స్వప్న, ముత్యాల లలిత, కోఆప్షన్ సభ్యులు గుర్రం ప్రసన్న, రఘునందన్‌చారి, మర్రి జగన్మోహన్‌రెడ్డి, సమ్మెయ్య జ్యోతి, ఖలీల్‌పాషా తదితరులు ఉన్నారు.



మేయర్, డిప్యూటీ మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఆర్‌ఎస్ కార్పొరేటర్లు

అమర జవాన్ల త్యాగాలను ఎప్పటికీ మరువలేం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

దిల్‌సుఖ్‌నగర్: దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన భారత వీర జవాన్ల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకుడు, దేప ఫౌండేషన్ చైర్మన్ దేప భాస్కర్‌రెడ్డి, ఎల్‌బీనగర్ ట్రాఫిక్ అదనపు సీఐ అంజపల్లి నాగమల్లు అన్నారు. పుల్వామా ఉగ్ర దాడిలో అమరులైన వీర జవాన్‌ల త్యాగాలను స్మరించుకుంటూ ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని మహాత్మా గాంధీ లా కాలేజీలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేప భాస్కర్ రెడ్డి, ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజపల్లి నాగమల్లు ముఖ్య అతిథులుగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్‌ల త్యాగాలను గుర్తించి విద్యార్థులు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ దేశభక్తి, క్రమశిక్షణతో ఉంటూ దేశ పురోగతికి కృషి చేయాలని కోరారు. గత 33 సంవత్సరాలుగా మహాత్మా గాంధీ లా కళాశాల చైర్మన్ గంగుల గోవర్ధన్ రెడ్డి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు.

ఆర్టీసీ సేవలపై కళాజాత బృందం అవగాహన

కడ్తాల్: ఆర్టీసీ బస్సులో ప్రయాణించాలని మంగళవారం మండల పరిధిలోని మక్తమాధారం, రావిచేడ్ గ్రామాల్లో ఆర్టీసీ కళాజాత బృందం సభ్యులు అవగాహన కల్పించారు. విద్యార్థులకు రాయితీతో కూడిన ఉచిత బస్‌పాస్ సౌకర్యం, దివ్యాంగులకు అందిస్తున్న బస్‌పాస్ సౌకర్యాలతో పాటు కార్గో పార్సిల్స్, కొరియర్ సేవలను వివరించారు. పుణ్యక్షేత్రాలకు వెళ్లే ప్రయాణికులకు టీఎస్ ఆర్టీసీ కలిపించే సౌకర్యాలపై రాయితీలపై పాటల రూపంలో వినిపించారు. ఆర్టీసీ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం ఆర్టీసీ సిబ్బంది, కళాజాత బృందం సభ్యులు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని మాదాయిపల్లికి చెందిన జయమ్మ (54) అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్, సర్పంచ్ హైమావతి, నాయకులు.. రామస్వామి, ఎండీ.ఆరీఫ్, లక్ష్మీనారాయణ మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియంల నిమిత్తం రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సత్యంగౌడ్, యాదయ్య, తిరుపతయ్య, భగవంత్, రామస్వామి, శ్రీశైలం, శాంతయ్య, గౌరయ్య పాల్గొన్నారు.

కల్యాణ మండప నిర్మాణానికి భూమిపూజ



పూజలో పాల్గొన్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

కడ్తాల్: బోయినుగుట్ట హనుమాన్ ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయం అందిస్తానని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం కడ్తాల్ మండలం చరికొండ గ్రామ పంచాయతీ పరిధిలోని బోయిన్‌గుట్ట హనుమాన్ ఆలయ ఆవరణలో శ్రీ సీతారాముల కల్యాణ మండప నిర్మాణానికి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి భూమిపూజ చేశారు. సర్పంచ్ భారతమ్మ, వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, నాయకులు భీష్మాచారి, అంజినాయక్, రాజు, సుమన్‌నాయక్, సతీశ్, పవన్, మల్లేశ్ ఉన్నారు.

నేడు ఆర్‌కేపురంలో హాత్ సే హాత్ జోడో యాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం మహేశ్వరం నియోజకవర్గంలో నిర్వహించే హాత్ సే హాత్ జోడో అభియాన్ పాదయాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్‌కేపురం డివిజన్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన దేప భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గంలో మొదటి మూడు రోజుల పాదయాత్ర రామకృష్ణాపురం డివిజన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం 7:30 గంటలకు అల్కాపురి కాలనీ చౌరస్తా నుంచి రామకృష్ణాపురం చౌరస్తా వరకు గడప గడపకు పాదయాత్ర కార్యక్రమం ఉంటుందన్నారు. డివిజన్ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని పిలునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర యువజన నాయకుడు చిలక ఉపేందర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్‌రావ్, రాష్ట్ర యూత్ నాయకులు శివ, శేఖర్‌ముదిరాజ్, పగడాల శ్రీశైలం, కల్యాణ్, జహంగీర్, మణికంఠ, కృష్ణ, అంజి, నగేష్, బాలు, మల్లేష్, కాళిదాసు, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వండి

దిల్‌సుఖ్‌నగర్: పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని బీఆర్‌ఎస్ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండాల్య నగేష్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్‌కేపురం డివిజన్ చిత్రాలేవుట్ కాలనీలో లయన్స్ క్లబ్ నల్గొండ గ్రేటర్ ఆధ్వర్యంలో ఈ వేస్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ పాత ల్యాప్‌టాప్‌లు, ఫోన్‌లు, కంప్యూటర్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అందజేశారు. నగేష్ మాట్లాడుతూ.. ఇక్కడ సేకరించిన వస్తువులను రీసైక్లింగ్ యూనిట్‌కి పంపించి పర్యావరణ హిత వస్తువుల తయారీకి వినియోగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ గవర్నర్ తీగల మోహన్‌రావు, క్లబ్ అధ్యక్షుడు చేరుపల్లి నర్సింహ, దుబ్బాక వెంకట్‌రెడ్డి, సాగర్ రెడ్డి, రవీందర్‌రావు, సుధాకర్‌రెడ్డి, అంజల్‌రావు, నాగార్జునరెడ్డి, చక్రారెడ్డి, ఆనంద్, భాస్కర్‌రెడ్డి, సురేష్‌కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



ఈ వేస్ట్‌ను సేకరిస్తున్న లయన్స్ క్లబ్ నల్గొండ గ్రేటర్ సభ్యులు

నూతన భవన నిర్మాణానికి నిధులివ్వండి

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్‌లో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం నిధులు మంజూర్ చేయాలని ఆ గ్రామ ఉపసర్పంచ్ రాజమోని తిరుపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి స్థానిక నాయకులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. ప్రస్తుతం గ్రామ పంచాయతీ భవనం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్నామన్నారు. దీంతో గ్రామ పంచాయతీ సమావేశాలు నిర్వహించాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తిరుపతి, వార్డుసభ్యులు రవి, గణేష్, మహేష్, దేవేందర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అన్ని హంగులతో పీఏసీఎస్ భవనం

యాచారం: ప్రాథమిక వ్యవసాయ పరిపతి సంఘం పాత భవనాన్ని కూల్చివేసి నూతన భవన నిర్మాణం చేయనున్నారు. ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనాన్ని కూల్చేసి విశాలమైన గదులు, అన్ని సౌకర్యాలతో కూడిన భవనాన్ని నిర్మించే విధంగా యాచారం పీఏసీఎస్ నిర్ణయించింది. ఈ భవనం నిర్మాణం కోసం ఆరు నెలల కింద పీఏసీఎస్ పాలకవర్గం కావాల్సిన నిధుల మంజూరు కోసం డీసీసీబీకి ప్రతిపాదనలు పంపింది. ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకున్న డీసీసీబీ పాత భవనాన్ని కూల్చేసి నూతన భవనం నిర్మించడానికి రూ.52 లక్షల నిధులను మంజూరు చేసింది. మంజూరైన నిధులతో త్వరలో నూతన భవనాన్ని నిర్మించేలా సోమవారం పీఏసీఎస్ చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన పాలకవర్గం సమావేశమై తీర్మానం చేసి టెండర్‌కు నిర్ణయించింది. డీసీసీబీ మంజూరు చేసిన రూ.52 లక్షల నిధులతో పాటు పీఏసీఎస్ లాభాల నుంచి రూ.10 లక్షలు అదనంగా కేటాయించి నూతన భవనాన్ని నిర్మించడానికి నిర్ణయించారు.

అన్నీ ఒకేచోట లభించేలా..

ఇన్నాళ్లు యాచారం పీఏసీఎస్‌లో కేవలం వరి విత్తనాలు, కొన్ని రకాల ఎరువులను మాత్రమే విక్రయిస్తున్నారు. ప్రతి యేటా రూ.30 లక్షలు ఖర్చు చేస్తూ ఎరువులు, విత్తనాలు రైతులకు అందిస్తున్నారు. నూతన భవన నిర్మాణం జరిగితే అన్నిరకాల ఎరువులు, విత్తనాలు, పెస్టిసైడ్స్ కూడా అందుబాటులో ఉంచనున్నారు. యాచారం మండలంలోని 24 గ్రామాల్లో అత్యధికంగా రైతులు వరి పంటతో పాటు పలురకాల కూరగాయల పంటలు, ఆకుకూరలు సాగు చేస్తారు. పీఏసీఎస్‌లో గ్రోమోర్, యూరియా తదితర ఎరువు మందులను కొనుగోలు చేస్తున్న రైతులు పురుగు మందులను ఇతర ప్రైవేట్ దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నారు. అయితే ఇకనుంచి పత్తి విత్తనాలతో పాటు అన్నిరకాల ఎరువులు, విత్తనాలు, పెస్టిసైడ్స్‌ను అందుబాటులో ఉంచనున్నారు. అదేవిధంగా వ్యవసాయ పనిముట్లు, యంత్ర పరికరాలు, ఇతర సామగ్రిని నిల్వ ఉంచనున్నారు. రైతుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలు ఒకేచోట లభించేలా సమకూర్చనున్నారు.

మంచి లాభాలు వచ్చేలా...

యాచారం పీఏసీఎస్‌లో మొత్తం 7,328 మంది సభ్యులు ఉన్నారు. అందులో 2,130 మంది రైతులు రూ.48 కోట్ల దీర్ఘకాలిక, రూ.11 కోట్ల స్వల్పకాలిక రుణాలు తీసుకున్నారు. ప్రతిఏటా రూ.30 లక్షల నిధులు ఖర్చుచేసి రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు అందిస్తున్నారు. అదే విధంగా ప్రతి ఏటా పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నారు. సంఘంలోని సభ్యు(రైతు)లు వ్యవసాయ పంటల సాగులో అవసరమయ్యే యంత్ర పరికరాలు, సామగ్రి, ఎరువులు, విత్తనాలు నిల్వఉంచి మంచి లాభాలు వచ్చే విధంగా కృషిచేస్తున్నారు. యాచారం పీఏసీఎస్ జిల్లాలోనే రూ.60 నుంచి రూ.75 కోట్ల లావాదేవీలు సాగిస్తుంది. అన్నిరకాల సేవలు అందిస్తే రూ.వంద కోట్ల లావాదేవీలు జరిపే అవకాశం ఉంది.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కే రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ వాసవీ కాలనీ, రాక్ హిల్స్, శారదానగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, అలాగే 11కేవీ కొహెడ, పెద్దఅంబర్‌పేట పట్టణ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, 11కేవీ శ్రీనివాస కాలనీ ఫీడర్ పరిధిలోని కాలనీలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

పోలీసులకు సన్మానం



డీసీపీ, ఏసీపీకి బొకే అందజేస్తున్న కౌన్సిలర్లు

పహాడీషరీఫ్: తుక్కుగూడలో డీసీపీ, ఏసీపీ కార్యాలయాల ఏర్పాటుకు పోలీస్ అధికారులు నిర్ణయం తీసుకోవడం పట్ల మున్సిపల్ కౌన్సిలర్లు రవినాయక్, సప్పిడి లావణ్య, తేజస్విని హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ అంజయ్యకు పూల బొకే అందించి ఘనంగా సన్మానించారు. కౌన్సిలర్ల అభ్యర్థన మేరకు తుక్కుగూడ టౌన్‌లో రెండు కార్యాలయాల ఏర్పాటుకు ఆదేశించిన మంత్రి సబితారెడ్డికి ఈ సందర్భంగా వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఎల్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఇష్టమైన రోజు మంగళవారం కావడంతో భక్తులు భారీగా తరలి వచ్చారు. మొక్కులు, కానుకలు చెల్లించుకున్నారు. ఆలయంలో సామూహిక సత్యానారాయణ వ్రతాలు ఆచరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, సిబ్బంది కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జల్‌పల్లి అంతర్గత రోడ్లకు రూ. 45కోట్లు

నిధుల మంజూరుపై హర్షం



మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని అంతర్గత రహదారులకు రూ.45 కోట్ల హెచ్‌ఎండీఏ నిధులు మంజూరు కావడం పట్ల మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ.. అధిక మురికివాడలు కలిగిన మున్సిపాలిటీపై మంత్రి సబితారెడ్డి ప్రత్యేక దృష్టిసారించి అభివృద్ధి పనులు చేపడుతున్నారని తెలిపారు. ఇప్పటికే కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు జరుగుతుండగా.. తాజాగా మంత్రి చొరవతో రూ.45 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో వేయనున్న అంతర్గత రహదారులతో ప్రజలకు ఎంతో వెసులుబాటు కలుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

చేతిరాతపై విద్యార్థులకు అవగాహన

మహేశ్వరం: పట్టణంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో నాదర్‌గుల్‌కి చెందిన శ్రీవంశీధర్ స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చేతి రాతపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పరీక్షల్లో చేతిరాత బాగుంటే మంచి మార్కులు సాధించవచ్చని చేతిరాత నిపుణుడు వెంకట్ తెలిపారు ఇంటర్మీడియట్ విద్యార్థులకు చేతిరాతపై అవగాహన కల్పించి, మెరుగుపరచుకునేందుకు విద్యార్థులు తీసుకోవాల్సిన చర్యల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బీ ధనుంజయ్, ఉపాధ్యాయులు బాబు, శ్రీహరి, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి



కందుకూరు: పుల్వామా ఉగ్రదాడుల్లో అమరులైన వీరజవాన్లకు సోమవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, కందుకూరు చౌరస్తాలో నివాళులర్పించారు.